E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
03-4-2025 గురువారం | పేజీలు–6 | హైదరాబాద్
ekaburu.com

మూసీ పరిసరాల్లో నిర్మాణాలపై తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు 2లో

## నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోయినా చూస్తూ ఉండాల్సిందేనా?

ఎమ్మెల్యేల అనర్హతపై నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోయినా కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.



**ఈ-కబురు,ఢిల్లీ:** ఎమ్మెల్యేల అనర్హతపై నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోయినా కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయని జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. భారాస ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. హైకోర్టు తరువాయి 3లో

## బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో గళం విప్పిన సీఎం



- తెలంగాణలో కుల గణన పూర్తి – ఒత్తిడికి లొంగలేదన్న సీఎం
- బీసీల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాటం – జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా
- కుల గణన అవసరం – బీసీలకు ప్రాతినిధ్యం దక్కాలంటే తప్పనిసరి
- భూమిలేని బీసీ, ఎస్సీ, ఎస్టీలకు భూకేటాయింపు – కాంగ్రెస్ చరిత్ర

తెలంగాణలో కుల గణన పూర్తి చేశామని, బీసీల హక్కుల కోసం కాంగ్రెస్ ఎప్పుడూ ముందుంటుందని సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ రిజర్వేషన్ల సాధన కోసం నిర్వహించిన మహా ధర్నాలో చెప్పారు.

42% రిజర్వేషన్లకు సై అనకుంటే ధర్మయుద్ధమే 2లో



## హెచ్‌సీయూలో తీవ్ర ఉద్రిక్తత.. పోలీసుల లాఠీఛార్జ్..!

కంచ గచ్చిబౌలి భూముల వివాదం నేపథ్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) వద్ద విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై హెచ్‌సీయూ విద్యార్థులు పోరుబాట కొనసాగిస్తున్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ వారు నిరసనలు తెలుపుతున్నారు. 3లో

## కంచ గచ్చిబౌలి భూముల్లో రేపటివరకు పనులుఆపాలి తెలంగాణ హైకోర్టు

3లో





## వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

**ఈ-కబురు,ఢిల్లీ:** వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై బుధవారం లోక్‌సభలో వాడీవేడీ చర్చ జరిగింది. 12 గంటల పాటు సుదీర్ఘ చర్చ అనంతరం అర్ధ రాత్రి దాటిన తర్వాత 3లో

## లోక్‌సభ ముందుకు 'వక్ఫ్ బిల్లు'.. ఏ కూటమి బలమెంత..?

వక్ఫ్ బిల్లుపై నేడు లోక్‌సభలో ఓటింగ్ జరగనుంది. మరి ఈ నేపథ్యంలో పార్టీల బలాబలాలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం..!



**ఈ-కబురు,ఢిల్లీ:** వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లు లోక్‌సభ ముందుకు వచ్చింది. ఈ బిల్లును ఆమోదింపజేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉండగా విపక్షాలన్నీ మూకుమ్మడిగా వ్యతిరేకిస్తున్నాయి. తొలుత దీని పై సభలో చర్చ నిర్వహించి, అనంతరం ఓటింగ్ జరపనున్నారు. మరి ఈ నేపథ్యంలో పార్లమెంట్ లో కూటముల బలాబలాలు ఎలా ఉన్నాయో ఓసారి చూద్దాం..!

**లోక్‌సభలో..**

ఈ బిల్లు లోక్‌సభలో గట్టెక్కాలంటే భాజపాకు సాధారణ మెజారిటీ అయిన 272 ఓట్లు కావాలి. ప్రస్తుతం సభలో భాజపాకు సొంతంగా 240 మంది ఎంపీలు ఉన్నారు. దాని మిత్రపక్షాలైన తెదేపాకు 16, జేడీయూకు 12 మంది సభ్యులున్నారు. ఇక, ఎల్జేపీ(రామ్ విలాస్)కు ఐదుగురు, ఆర్ఎల్‌డీకి ఇద్దరు, శివసేన (శిందే)కు ఏడుగురు ఎంపీలు ఉన్నారు. అంటే మొత్తంగా భాజపాకు 282 మంది ఎంపీల బలం ఉంది. ఉభయ సభల్లోనూ బిల్లుకు మద్దతివ్వాలని ఎన్డీయే భాగస్వామ్య పార్టీలు ఇప్పటికే నిర్ణయించాయి. ఇక, తరువాయి 3లో



## 'డోజ్' నుంచి వైదొలగనున్న మస్క్.. సన్నిహితులతో ట్రంప్

ప్రభుత్వ సలహాదారుగా ఉన్న మస్క్.. త్వరలోనే ఆ బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు తెలిసింది.

**ఈ-కబురు:** డోజ్‌కు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి కీలక విషయం బయటకు వచ్చింది. ప్రభుత్వ సలహాదారుగా ఉన్న ఎలాన్ మస్క్ త్వరలోనే ఆ బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు సమాచారం. మే చివరి లేదా జూన్ మొదటి వారంలో మస్క్ ఆ బాధ్యతల నుంచి బయటకు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ముగ్గురు సన్నిహితులతో పాటు కేబినెట్‌కు డొనాల్డ్ ట్రంప్ చెప్పినట్లు 2లో



## ప్రతీకార సుంకాలు.. ఏడాదికి రూ.51లక్షల కోట్ల ఆదాయం?

ప్రతీకార సుంకాల వల్ల అగ్రరాజ్యానికి ఏటా భారీ స్థాయిలో ఆదాయం సమకూరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**ఈ-కబురు:** భారత్ సహా అనేక దేశాలపై ప్రతీకార సుంకాలు విధించేందుకు అమెరికా సిద్ధమైంది. మరికొన్ని గంటల్లోనే అధ్యక్షుడు ట్రంప్ వీటిపై ప్రకటన చేయనుండగా.. తక్షణమే అమల్లోకి వస్తాయని వైట్‌హౌస్ వర్గాలు తరువాయి 3లో

## పేదలు సన్న బియ్యం స్కీమ్ సద్వినియోగం చేసుకోవాలి

పేదలు సన్న బియ్యం స్కీమ్ సద్వినియోగం చేసుకోవాలి: మంత్రి సీతక్క



**హైదరాబాద్ ఈ-కబురు:** పేదలకు కడుపునిండా తిండి పెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని 2లో

## కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై స్పందించిన కేంద్ర ప్రభుత్వం

కోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకొని ముందుకు వెళ్లాలన్న కేంద్రం అటవీ చట్టానికి లోబడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశం వాస్తవ నివేదిక వివరాలను, తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో ఇవ్వాలన్న కేంద్రం 2లో





## శాంతి చర్చలకు సిద్ధం.. మావోయిస్టుల లేఖ...!

శాంతి చర్చలకు మేం సిద్ధం... మీరు సిద్ధమేనా...! అయితే రండి చర్చించుకుందాం అంటూ కేంద్రానికి మావోయిస్టులు లెటర్ రాయడం హాట్‌టాపిక్‌గా మారింది. మరి మావోయిస్టుల లెటర్‌పై కేంద్రం రియాక్షన్ ఎలా ఉండబోతోంది...? అసలు ఆల్ ఆఫ్ సడెన్‌గా మావోలు స్వరం మార్చడానికి కారణాలేంటి...? ఈ వివరాలను ఒకసారి చూడండి..

- శాంతి చర్చలకు మేం సిద్ధం..
కేంద్ర ప్రభుత్వానికి మావోయిస్టుల సంచలన లేఖ..

కేంద్ర ప్రభుత్వానికి మావోయిస్టులు సంచలన లేఖ రాశారు. శాంతిచర్చలకు తాము సిద్ధమని ప్రకటించారు. కేంద్రకమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట లెటర్‌ను రిలీజ్ చేశారు. ప్రజాప్రయోజనాల కోసం తాము ఎలాంటి చర్చలకైనా సిద్ధమే అన్నారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణలో కాల్పులు విరమించాలని కోరారు. చర్చలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తరువాయి 3లో



## ఉతికి ఆరేసిన బట్లర్.. ఆర్సీబీపై గుజరాత్ ఘన విజయం

6లో

## ముంబై ఇండియన్స్‌కు కొనసాగనున్న కష్టాలు..!

6లో

## తెలంగాణలో మరో ఎయిర్ పోర్టుకు గ్రీన్ సిగ్నల్

**ఈ-కబురు: ఆదిలాబాద్** ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు భారత వాయుసేన గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పౌర విమాన సేవలను ప్రారంభించేందుకు అనుమతులు మంజూరు చేసింది. ఆరు నెలల వ్యవధిలోనే రెండు ఎయిర్ పోర్టులకు అనుమతులు రావడం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అవిశ్రాంత కృషికి దక్కిన ఫలితమన్నారు మంత్రి కోమటిరెడ్డి. ఆదిలాబాద్ ఎయిర్ పోర్టునుఅభివృద్ధి చేసి పౌర విమానయాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్రానికి తరువాయి 2లో



## నేరుగా వాట్సాప్‌లో.. ఇన్వెస్టర్లకు సరికొత్త ఫీచర్

4లో



# 'డోజ్' నుంచి వైదొలగనున్న మస్క్.. సన్నిహితులతో ట్రంప్

మొదటి పేజీ తరువాయి

అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ విభాగానికి ఎలాన్ మస్క్‌ను సారథిగా నియమించారు. ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులు, శాఖల్లో వృథా ఖర్చులు తగ్గించడమే లక్ష్యంగా ఇది పని చేస్తుందని చెప్పిన ట్రంప్.. ఆ విధంగానే వివిధ శాఖల్లో వేలాది మంది ఉద్యోగులను తొలగించే ప్రక్రియను చేపట్టారు.
ఈ క్రమంలో మస్క్ తీరుపై తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. ట్రంప్ యంత్రాంగాన్ని ఎలాన్ మస్క్ వెనకుండి నడిపిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో డోజ్‌లో మస్క్ ఉద్యోగి కాదని, ఆయనకు ఎటువంటి నిర్ణయాధికారాలూ లేవని వైట్‌హౌస్ క్లారిటీ ఇచ్చింది. ట్రంప్ సలహాదారుడిగా మాత్రమే మస్క్ ఆ బాధ్యతలు చూస్తున్నారని వెల్లడించిన సంగతి తెలిసిందే.

# 42% రిజర్వేషన్లకు సై అనకుంటే ధర్మయుద్ధమే

**మహాధర్నాలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో వీర్లపల్లి శంకర్, ప్రకాశ్‌గౌడ్, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మహేశ్‌కుమార్‌గౌడ్, నారాయణ, జాజుల భట్టివిక్రమార్క, పొన్నం ప్రభాకర్, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు**

**ఈ-కబురు , దిల్లీ:**

''సంధి కోసం కనీసం ఐదు గ్రామాలైనా ఇవ్వాలని ఆనాడు కృష్ణుడు అడిగితే దుర్యోధనుడు వినకుండా విర్రవీగాడు. చివరకు కురుక్షేత్రంలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. సయోధ్యలో భాగంగానే మేం హస్తినకు వచ్చి.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు అనుమతివ్వాలని మోదీకి విజ్ఞప్తి చేశాం. చట్టాలను సవరించి.. 42% రిజర్వేషన్ల అమలుకు అనుమతించకపోతే మీరు గద్దె దిగాల్సిందే.. గ్రామాల్లో మీ గద్దెలు కూలాల్సిందే. మమ్మల్ని తక్కువ అంచనా వేస్తే ఎర్రకోటపై జెండా ఎగరేస్తాం. మా రిజర్వేషన్లు మేం సాధిస్తాం'' అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ చేసిన తీర్మానానికి అనుగుణంగా రిజర్వేషన్లు పెంచుకోవడానికి అనుమతివ్వాలని కోరుతూ జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పలు బీసీ సంఘాలు దిల్లీలోని జంతర్‌మంతర్‌లో బుధవారం మహాధర్నా నిర్వహించాయి. దీనికి సీఎం హాజరై మాట్లాడారు. ''బీసీలకు 42% రిజర్వేషన్లపై శాసన సభలో ఏకగ్రీవంగా తీర్మానించి పంపినా.. అనుమతివ్వడానికి ప్రధానికొచ్చిన కష్టమేంది?

బిల్లుకు అనుకూలమని జంతర్‌మంతర్ వేదికగా 16 పార్టీలు ప్రకటించాయి. తాను బీసీల కోసమే ఉన్నానని ప్రధాని మోదీ అంటున్నారు. బీసీల కోసం ప్రాణాలిస్తామని బండి సంజయ్ ప్రకటిస్తున్నారు. మేం మీ ప్రాణాలు కాదు.. 42% రిజర్వేషన్లు మాత్రమే కోరుతున్నాం. దీనికి అనుమతివ్వకపోతే.. దేశమంతా జాగృతం చేసి అన్ని సంఘాలను కూడగడతాం. నిప్పురవ్వలా రగిలి దేశమంతటా కార్చిచ్చులా వ్యాపిస్తుంది. మీరు దిల్లీ గద్దెపై ఎలా ఉంటారో చూస్తాం. మా డిమాండ్లకు మోదీ దిగైనా రావాలి... లేదంటే గద్దె దిగైనా పోవాలి. 2015లో ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ జంతర్‌మంతర్‌లో ధర్నా చేసి అలసిపోయి చెట్టు కింద కూర్చున్నప్పుడు 'మీది ధర్మమైన కోరిక కాబట్టి ధర్మయుద్ధం ప్రకటించాల'ని నేను చెప్పడంతో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో లక్షల మంది సమక్షంలో ధర్మయుద్ధం ప్రకటించి విజయం సాధించి లక్ష్యం చేరుకున్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే పరేడ్ గ్రౌండ్‌లో పది లక్షల మందితో ధర్మయుద్ధం ప్రకటించి మన బలమేంటో చూపిద్దాం'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**రాహుల్ గాంధీ హామీ నెరవేర్చేందుకే కులగణన**

''కులగణనకు స్ఫూర్తి రాహుల్ గాంధీయే. ఆయన కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సుమారు 150 రోజులు.. 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినప్పుడు తమ జనాభా లెక్కలు తేల్చాలని ఆయనను బీసీ సంఘాల ప్రతినిధులు అడిగారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి జనగణనతోపాటు కులగణన కూడా చేయాలని.. దేశంలో ఎవరెంత మంది ఉన్నారో లెక్కతేల్చి దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని, నియామకాలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. పార్టీ ఎక్కడ అధికారంలోకి వచ్చినా కులగణన చేస్తామని.. బీసీలకు ఉద్యోగావకాశాల్లోనే కాకుండా రాజకీయ రిజర్వేషన్లు పెంచుతామని రాహుల్ వాగ్దానం చేశారు. ఆయన ఇచ్చిన మాటను నెరవేర్చుతూ రాష్ట్రంలో మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే కులగణన పూర్తి చేసి.. దేశానికి దిక్సూచిగా నిలిచాం. దేశంలో ఇంత పకడ్బందీగా కులగణన చేసిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణయే. భాజపా అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదు. కులగణన లెక్కలను ఫిబ్రవరి 4న చట్టసభలో ప్రవేశపెట్టాం. రాష్ట్రంలో బలహీనవర్గాలవారు 56.36 శాతం మంది ఉన్నట్లు లెక్క తేలింది. వారికి స్థానిక సంస్థల్లోనే కాకుండా విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్లు అమలు చేసినప్పుడే న్యాయం జరుగుతుంది. రిజర్వేషన్ల పెంపు అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంది కాబట్టే శాసనసభలో తీర్మానం చేసి పంపాం. మేం దీన్ని భాజపా పాలిత గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో అమలు చేయాలని అడగడం లేదు. తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు అనుమతివ్వాలని మాత్రమే అడుగుతున్నాం.

**తండ్రీకొడుకుల ఉద్యోగాలు ఊడగొట్టిన ఘనత యువతదే**

తెలంగాణ ఉద్యమం జరిగిందే ఉద్యోగాల కోసం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేయాలని యువత గల్లీ నుంచి దిల్లీదాకా పోరాడితే.. ఆనాడున్న ముఖ్యమంత్రి, ఆయన కుమారుడు ఆ పని చేయలేదు. ఎంతమంది యువత ప్రాణాలర్పించినా వారి వేదన నాటి పాలకుల చెవికెక్కలేదు. తండ్రీకొడుకుల ఉద్యోగాలు ఊడగొడితే మీ ఉద్యోగాలు మీ ఇంటికొస్తాయని ఎన్నికల ప్రచారంలో యువతకు చెప్పాను. వారిద్దరి ఉద్యోగాలను యువత ఊడగొట్టింది. ఇచ్చిన మాట ప్రకారం ఏడాదిలోపు 59 వేల ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టి చిత్తశుద్ధి చాటుకున్నాం.

**మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా భాజపా కమండల్ యాత్ర**

బలహీనవర్గాల లెక్క తేల్చేందుకు అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ మండల్ కమిషన్ ఏర్పాటు చేశారు. దేశంలో 52% శాతం మంది బీసీలున్నారని, వారికి 27% రిజర్వేషన్లు ఇవ్వాలని కమిషన్ సిఫార్సు చేసింది. వీపీ సింగ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కమిషన్ సిఫార్సుల అమలు మొదలుపెట్టారు. దాన్ని అడ్డుకునేందుకు అప్పుడు భాజపా కమండల్ యాత్ర చేపట్టింది. ఆ భాజపాకు చెందిన మోదీయే ఇప్పుడు ప్రధానిగా ఉన్నారు. జనగణనతోపాటు కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేయడంతో ఆ పని ఎక్కడ చేయాల్సి వస్తుందోనని మోదీ ప్రభుత్వం కుట్రపూరితంగా 2021 జనాభా లెక్కలను వాయిదా వేసింది. బలహీనవర్గాల వారంతా ఏకమై తమ లెక్కలు తేల్చాలని ఎలుగెత్తితే తప్ప ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్లు పెరగవు. అధికారం ఉంది కదాని మాపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నించొద్దు. ఆధిపత్యం చెలాయించాలనుకున్న నిజాంలు, రజాకార్లకు ఏ గతి పట్టిందో, ఉమ్మడి రాష్ట్రంలో ఏం జరిగిందో, తెలంగాణలో గడీల నుంచి పరిపాలన అందించినవాళ్లు ఈరోజు ఎక్కడున్నారో చూడండి. ఈరోజు దిల్లీలో గద్దెమీద ఉంటున్నామని అనుకుంటున్నారేమో. ఎప్పుడైనా మీరు, మీవాళ్లు గల్లీకి రావాల్సిందే. అప్పుడు మా చేతికి దొరుకుతారన్న విషయం మరిచిపోవద్దు. చిన్న సాయం చేసినా గుర్తుపెట్టుకొనే బలహీనవర్గాలకు అన్యాయం చేస్తే మర్చిపోతారని ఎలా అనుకుంటారు?'' అని రేవంత్‌రెడ్డి ప్రధానిని ఉద్దేశించి అన్నారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో గళం విప్పిన సీఎం

**ఈ-కబురు,దిల్లీ :**
తెలంగాణలో కుల గణన చేపట్టొద్దంటూ తీవ్ర ఒత్తిడి వచ్చినా, తాము దానికి తలొగ్గకుండా ఆ పని పూర్తి చేశామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇవాళ ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సంఘాలు నిర్వహించిన మహా ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, "బీసీల హక్కులు కాపాడే విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుంది. న్యాయం చేయడంలో వెనుకడుగు వేయదు" అని స్పష్టం చేశారు.
"దేశవ్యాప్తంగా బీసీలకు హక్కులను కల్పించాలంటే, కుల గణన చేయడం తప్పనిసరి. కుల గణన లేకుండా బీసీలకు సరైన ప్రాతినిధ్యం దక్కదని కోర్టులు కూడా చెప్పాయి. స్థానిక సంస్థలు, చట్టసభల్లో బీసీలకు సరైన స్థానం కల్పించాలంటే, వారి జనాభా లెక్కలు స్పష్టంగా ఉండాలి. అందుకే కాంగ్రెస్ పార్టీ కుల గణన చేయాలని నిర్ణయించింది. జనాభా లెక్కలు తెలియకపోతే రిజర్వేషన్లు ఎలా ఇస్తారు? బీసీలకు కేటాయించాల్సిన వాటా ఎంత అనేది లెక్కలు తెలియకపోతే ఎలా ఖరారు చేస్తారు?" అంటూ సీఎం రేవంత్ ప్రశ్నించారు.

భారతదేశంలో బలహీన వర్గాల గణన అవసరమని మొరార్జీ దేశాయ్ హయాంలో మండల్ కమిషన్ ఏర్పాటు చేయబడిందని సీఎం గుర్తుచేశారు. "మండల్ కమిషన్ నివేదిక ప్రకారం, 52% బలహీన వర్గాలకు 27% రిజర్వేషన్లు ఇవ్వాలని అప్పట్లోనే సిఫార్సు చేశారు. కానీ, బీజేపీ ఆ కమిషన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించింది. కమిషన్ సూచనలను అడ్డుకోవడానికి కమండల్ యాత్ర పేరిట బీసీలకు వ్యతిరేకంగా కుట్ర పన్నింది" అని ఆరోపించారు. బీసీల హక్కులను కాపాడేందుకు జంతర్ మంతర్ వద్ద జరిగిన ఈ ధర్నా తాము నిర్వహించామని, భూమిలేని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కాంగ్రెస్ భూమిని అందించిన చరిత్ర తమదని సీఎం రేవంత్ చెప్పారు.







# కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై స్పందించిన కేంద్ర ప్రభుత్వం

హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి ప్రాంతంలో గల భూముల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. 400 ఎకరాల భూములను పరిరక్షించాలంటూ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నాయకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాన్ని బీజేపీ ఎంపీలు పార్లమెంటు ఉభయ సభల్లో సైతం లేవనెత్తారు.

కంచ గచ్చిబౌలి భూములపై వాస్తవ నివేదికను పంపాల్సిందిగా తెలంగాణ అటవీ శాఖను తాజాగా కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది.

ఈ నేపథ్యంలో న్యాయస్థానాల తీర్పులను పరిగణనలోకి తీసుకొని ముందుకు వెళ్లాలని, అటవీ చట్టాలకు లోబడి చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. కంచ గచ్చిబౌలి ప్రాంతంలోని ఈ భూమికి సంబంధించిన వాస్తవ నివేదిక వివరాలను, తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో సమర్పించాలని కేంద్రం పేర్కొంది.



## మూసీ పరిసరాల్లో నిర్మాణాలపై తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

**ఈ-కబురు ,హైదరాబాద్:**
మూసీ పరిసరాల్లో నిర్మాణాల నియంత్రణకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మూసీ పరిసరాల్లో ప్రణాళికా రహిత నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకుంది. ఇందుకోసం నలుగురు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జేఎండీ, డీటీసీపీ, జీహెచ్ఎంసీ చీఫ్ ప్లానర్, హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. మూసీకి 50 మీటర్ల వరకు బఫర్‌జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఉత్తర్వులు జారీ చేసింది. 50 నుంచి 100 మీటర్ల వరకు కొత్తగా ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని ఉత్తర్వుల్లో పేర్కొంది. మాస్టర్ ప్లాన్ ఖరారయ్యే వరకు, కమిటీ క్లియర్ చేసేంత వరకు ఏవిధమైన కొత్త అనుమతులు ఇవ్వకూడదని ప్రభుత్వం ఆదేశించింది. మూసీకి 100 మీటర్ల వరకు ప్రభుత్వ పనులు చేపట్టాలన్నా ముందస్తు అనుమతి తప్పనిసరని స్పష్టం చేసింది.

# పేదలు సన్న బియ్యం స్కీమ్ సద్వినియోగం చేసుకోవాలి



మొదటి పేజీ తరువాయి

మంత్రి సీతక్క అన్నారు. బుధవారం (ఏప్రిల్ 2) ములుగు జిల్లాలోని గోవింద రావు పేట, మల్లంపల్లి, తాడ్వాయి మండలాల్లో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేశారు మంత్రి సీతక్క. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇక అన్నమో రామచంద్ర అనే కాలం పోయిందని.. పేదలకు కడుపునిండా తిండి పెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశంలోనే రేషన్ ద్వారా సన్నబియ్యం పథకం అమలు చేయడం చారిత్రాత్మకమని అన్నారు.

పేదలు సన్న బియ్యం పథకం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన పేదలకు త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందిస్తామని తెలిపారు. ఆహార భద్రత చట్టం తెచ్చిన ఘనత మా ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. త్వరలోనే మిగిలిన హామీలను అమలు చేస్తామని అన్నారు.

# తెలంగాణలో మరో ఎయిర్ పోర్టుకు గ్రీన్ సిగ్నల్



మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి భారత వాయుసేన అంగీకరించింది.

త్వరలోనే అక్కడ వాయుసేన శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసే యోచనలో కేంద్రం ఉన్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. జాయింట్ యూజర్ ఎయిర్ ఫీల్డ్ గా అభివృద్ధి చేయాలని వాయుసేన లేఖ ద్వారా సూచించిందని కోమటి రెడ్డి తెలిపారు. రన్ వే పునర్నిర్మాణ , పౌర టర్మినల్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఎయిర్ క్రాఫ్ట్ ఎప్రాన్ సహా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు కోమటిరెడ్డి. వీటికి అవసరమైన భూమిని ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఇవ్వాలని వాయుసేన సూచించినట్లు చెప్పారు. ఈ విషయంపై అధికారులతో సమీక్షిస్తున్నామని...త్వరలోనే అన్ని వివరాలతో కూడిన నివేదికను కేంద్రానికి పంపిస్తామన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.



## ప్రతీకార సుంకాలు..
## ఏడాదికి రూ.51లక్షల కోట్ల ఆదాయం?

మొదటి పేజీ తరువాయి

తెలిపాయి. ఈ నేపథ్యంలో వీటి వల్ల అగ్రరాజ్యానికి ఏటా భారీ స్థాయిలో ఆదాయం సమకూరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వైట్‌హౌస్ వర్గాల ప్రకారం ఏటా 600 బిలియన్‌ల నుంచి 700 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరనున్నట్లు అంచనా.

**పదేళ్లలో 6 ట్రిలియన్ డాలర్లు..**

చైనా, కెనడా, మెక్సికో నుంచి దిగుమతి చేసుకునే కొన్ని వస్తువులపై 25శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇదివరకే స్పష్టం చేశారు. మరికొన్ని వస్తువులపై ఇవి భారీగా ఉండనున్నాయనే సంకేతాలు ఇచ్చారు. అయితే, వీటివల్ల అమెరికాకు ఏమేరకు ఆదాయం సమకూరుతుందనే విషయం ఆసక్తిగా మారింది. వీటిపై వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మాట్లాడుతూ.. కొత్త టారిఫ్‌ల వల్ల ఏటా 600 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అంచనా వేశారు. ఆటో టారిఫ్‌ల వల్ల మరో 100 బిలియన్ డాలర్లు వస్తాయన్నారు. మొత్తంగా వచ్చే పదేళ్ల కాలంలో 6 ట్రిలియన్ డాలర్లు సమకూరనున్నట్లు పేర్కొన్నారు.

**ప్రతీకార సుంకాలు.. వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ 100 శాతం వసూళ్లు భారీ ఆదాయం కష్టమే..!**

ఇదే విషయంపై చట్టసభ సభ్యులతో ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ.. ఈ సుంకాలపై పరిమితి ఉంటుందని, ఆయా దేశాలతో చర్చల తర్వాత వీటిని తగ్గించే అవకాశం ఉందన్నారు. వైట్‌హౌస్ మాత్రం వీటి విధానానికి సంబంధించి అధికారికంగా ఎటువంటి వివరాలు వెల్లడించలేదు. అయితే, వైట్‌హౌస్ వర్గాల అంచనా కంటే ఈ ఆదాయం తక్కువే ఉంటుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. వైట్‌హౌస్ వర్గాలు చెబుతున్నట్లుగా అంత ఆదాయం వచ్చే అవకాశం లేదని, 100బి.డాలర్ల నుంచి 200బి.డాలర్లు వస్తే అదృష్టమని మూడీ చీఫ్ ఎకానమిస్ట్ మార్క్ జాండీ పేర్కొన్నారు.

**పన్నుల భారమేనా..?**

దిగుమతులపై సరాసరి 20% పన్ను విధిస్తే ఒక్కో కుటుంబంపై అదనంగా 3400 డాలర్ల నుంచి 4200 డాలర్ల భారం పడనున్నట్లు యేల్ యూనివర్సిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు. దేశీయంగా ఉత్పత్తులను పెంచడం వల్ల ఆ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు ట్రంప్ విధానం కచ్చితంగా సరైందేనని వైట్‌హౌస్ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ.. ప్రజలు, మిత్రదేశాలు మాత్రం ఈ సుంకాలను ముప్పుగానే భావిస్తున్నాయి.



## లోక్‌సభ ముందుకు 'వక్ఫ్ బిల్లు'..
## ఏ కూటమి బలమెంత..?

మొదటి పేజీ తరువాయి

ఇతర చిన్న పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తే తమకు 295 ఓట్లు అనుకూలంగా వస్తాయని ఎన్డీయే భావిస్తోంది. దీంతో సునాయాసంగానే బిల్లును ఆమోదించుకోవచ్చని అధికార పార్టీ చూస్తోంది.

ఇక, కాంగ్రెస్ , దాని మిత్రపక్షాలకు కలిపి లోక్‌సభలో 234 మంది సభ్యులున్నారు. ఇప్పటికే ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు మంగళవారం పార్లమెంటు హౌస్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యాయి. కాంగ్రెస్‌తో పాటు సమాజ్‌వాదీ, ఎన్సీపీ (ఎస్పీ), టీఎంసీ, ఆప్, డీఎంకే, వామపక్షాల నేతలు హాజరయ్యారు. వీరంతా బిల్లుపై చర్చలో క్రియాశీలంగా పాల్గొంటూనే వ్యతిరేకిస్తూ ఓటేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అయితే, బిజు జనతాదళ్ వంటి కొన్ని పార్టీలు తటస్థంగా ఉన్నాయి. ఆ పార్టీలు ఎటు ఓటు వేస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. ఎలాగైనా సరే.. లోక్‌సభలో అధికార ఎన్డీయేకు పూర్తి మెజారిటీ ఉన్నందున ప్రభుత్వానికి ఏ ఇబ్బంది ఎదురుకాదు.

**రాజ్యసభలో ఇలా..**

అటు రాజ్యసభ లోనూ భాజపాకు స్వల్ప ఆధిక్యం ఉంది. 245 మంది సభ్యులున్న ఎగువ సభలో బిల్లు ఆమోదం పొందాలంటే 119 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం భాజపాకు సొంతంగా 98 మంది ఎంపీలు ఉన్నారు. మిత్రపక్షాలతో కలిసి ఎన్డీయే సంఖ్యాబలం 125గా ఉంది. ఈ వక్ఫ్ సవరణ బిల్లు గురువారం పెద్దల సభకు రానుంది.

## శాంతి చర్చలకు సిద్ధం..
## మావోయిస్టుల లేఖ...!

మొదటి పేజీ తరువాయి

సిద్ధమైతే.. తక్షణమే కాల్పుల విరమణకు తాము కూడా సిద్ధమేనని లేఖలో వివరించారు. శాంతిచర్చల కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని మేధావులు, రచయితలు, హక్కుల సంఘాలకు మావోయిస్టులు విజ్ఞప్తి చేశారు. ఇక 2004లో ఏపీ ప్రభుత్వంతో మావోయిస్టుల శాంతిచర్చలు జరిగిన తర్వాత.. సుమారు 20 ఏళ్లకు మళ్లీ శాంతిచర్చల కోసం మావోయిస్టులు ప్రతిపాదన చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఇటు కొన్నాళ్లుగా మావోయిస్ట్ రహిత భారత్ నినాదంతో ఆపరేషన్ కగార్‌ను దూకుడుగా ముందుకు తీసుకెళ్తోంది కేంద్ర ప్రభుత్వం. గత 100 రోజుల్లో ఎన్‌కౌంటర్‌ల ద్వారా 120 మందికి పైగా మావోయిస్టులను భద్రతా బలగాలు మట్టుపెట్టాయి. మరోవైపు పెద్దఎత్తున మావోయిస్టులు లొంగిపోతున్నారు.

ఈ క్రమంలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు మావోయిస్టులు శాంతి చర్చల ప్రతిపాదన ఉంచారు. మరి మావోయిస్టుల లెటర్‌పై కేంద్రం ఎలా స్పందిస్తుంది...? రండి కూర్చుని మాట్లాడుకుందాం అంటుందా... లేక ఏం పట్టించుకోకుండా ఆపరేషన్ కగాన్‌ను కంటిన్యూ చేస్తుందా చూడాలి...!

# నాలుగేళ్లు స్పీకర్ చర్యలు
## తీసుకోకపోయినా చూస్తూ ఉండాల్సిందేనా?

మొదటి పేజీ తరువాయి

ఆదేశాలు ఇచ్చినా తగిన చర్యలు తీసుకోలేదని సుప్రీంకోర్టులో ఇటీవల భారాస నేతలు పిటిషన్ దాఖలు చేశారు. ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గత వారం వాదనలు ముగిశాయి. తాజాగా స్పీకర్ తరఫున రోహత్గీ వాదనలు వినిపిస్తూ పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

"స్పీకర్‌కు రాజ్యాంగం కల్పించిన విశేషాధికారాలను కోర్టులు హరించలేవు. ఒకసారి ఆయన నిర్ణయం తీసుకున్నాకే జ్యుడిషియల్ సమీక్షకు అవకాశముంటుంది. స్పీకర్ కాలపరిమితితో నిర్ణయం తీసుకోవాలని కోర్టు చెప్పడం భావ్యం కాదు. ఒకవేళ సూచనలు చేస్తే స్వీకరించాలా? లేదా? అనేది స్పీకర్ నిర్ణయమే. ఒక రాజ్యాంగ వ్యవస్థపై మరో రాజ్యాంగ వ్యవస్థ పెత్తనం చేయలేదు" అని ముకుల్ రోహత్గీ వాదించారు.



అనంతరం జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు చెప్పలేమా? ఆయనకు విజ్ఞప్తి చేయడమో.. ఆదేశించడమో చేయలేమా అని ప్రశ్నించారు. అనంతరం రోహత్గీ స్పందిస్తూ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన వారంలోనే పిటిషన్ వేశారన్నారు. ఒకదాని తర్వాత మరొక రిట్ పిటిషన్లు దాఖలు చేస్తూ వచ్చారని.. కనీసం ఆలోచించే అవకాశం కూడా లేకుండా పిటిషన్లు వేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

ముకుల్ రోహత్గీ వాదనల్లో జస్టిస్ బీఆర్ గవాయ్ జోక్యం చేసుకున్నారు. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయని చెప్పారు. నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోతే కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా? అని ప్రశ్నించారు. ఫిరాయింపుపై పిటిషనర్ల ఇష్టానుసారం స్పీకర్ వ్యవహరించలేరని రోహత్గీ అన్నారు. "2024 మార్చి 18న పిటిషనర్లు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. 2025 జనవరి 16న 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. స్పీకర్ తన విధులు నిర్వర్తిస్తున్నారు" అని కోర్టుకు తెలిపారు.

## హెచ్‌సీయూలో తీవ్ర ఉద్రిక్తత..
# పోలీసుల లాఠీఛార్జ్..!



మొదటి పేజీ తరువాయి

అయితే, బుధవారం ఉదయం హెచ్‌సీయూ క్యాంపస్‌ను వేలాది మంది పోలీసులు చుట్టుముట్టారు. క్యాంపస్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసి, వర్సిటీ లోపలికి బయటి వ్యక్తులను రానివ్వకుండా చేయడంతో పాటు విద్యార్థులను బయటకు పోనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు.

దీంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా క్యాంపస్‌లో విద్యార్థులు, ప్రొఫెసర్లు నిరసనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్లు, విద్యార్థులపై లాఠీఛార్జ్ చేశారు. దాంతో పోలీసుల తీరుపై ప్రొఫెసర్లు, విద్యార్థులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తూ, పోలీస్ జులుం నశించాలని నినాదాలు చేశారు. దీంతో హెచ్‌సీయూ క్యాంపస్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.



### వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

బిల్లు ఆమోదం కోసం స్పీకర్ ఓం బిర్లా ఓటింగ్ నిర్వహించారు. అనుకూలంగా 282 మంది సభ్యులు ఓటు వేయగా.. 232 మంది సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. భాజపా నేతృత్వంలోని ఎన్డీయే పక్షాలు, ప్రతిపక్ష ఇండియా కూటమిలోని ప్రధాన పార్టీలు తమ ఎంపీలు అందరికీ విప్ జారీ చేసిన విషయం తెలిసిందే. గురువారం వక్ఫ్ బిల్లు రాజ్యసభకు వెళ్లనుంది. ఈ బిల్లుపై చర్చకు ఎగువసభలో 8 గంటల సమయాన్ని కేటాయించారు.

## కంచ గచ్చిబౌలి భూముల్లో రేపటివరకు
# పనులుఆపాలి తెలంగాణ హైకోర్టు

**నగరంలోని కంచ గచ్చిబౌలి భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టులో వాదనలు కొనసాగాయి.**

**ఈ-కబురు,హైదరాబాద్:** నగరంలోని కంచ గచ్చిబౌలి భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టులో వాదనలు కొనసాగాయి. వాదనలు విన్న ధర్మాసనం.. కంచ గచ్చిబౌలి భూముల్లో ఏప్రిల్ 3 (గురువారం) వరకు పనులు ఆపాలని ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను ఏప్రిల్ 3వ తేదీకి వాయిదా వేసింది.

కంచ గచ్చిబౌలి భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలని వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ఉన్నత న్యాయస్థానంలో వాదనలు కొనసాగాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) తరఫున ఎల్. రవి శంకర్ వాదనలు వినిపించారు. "గత ఏడాది జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం జీవో 54 తీసుకొచ్చింది. ఈ జీవో ప్రకారం 400 ఎకరాల ప్రభుత్వ భూమిని టీజీఐఐసీకి ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఒకవేళ అది ప్రభుత్వ భూమి అయినా సుప్రీంకోర్టు తీర్పులకు లోబడే ప్రభుత్వాలు పని చేయాల్సి ఉంటుంది. కంచ గచ్చిబౌలి భూముల వద్ద భారీ వాహనాలను ఉపయోగించి చెట్లను కొట్టేసి, భూమిని



**ఇప్పటివరకు ఈ భూమి అటవీ భూమి అని ఒక్క వాదన కూడా లేదు. కంచ గచ్చిబౌలి భూములు.. అటవీ భూములని ప్రభుత్వం సైతం ఎక్కడా నోటిఫై చేయలేదన్నారు. ఇది పూర్తిగా పరిశ్రమలు, ఇతర అవసరాలకు కేటాయించిన స్థలం మాత్రమేనని.. అటవీ భూమి కానే కాదన్నారు. నిజాం కాలం నుంచి ఈ భూమి.. బీడు భూమిగానే ఉందని కోర్టుకు తెలిపారు. అయితే, ఈ 400 ఎకరాలు పరిశ్రమల భూమి అని రికార్డుల్లో ఎక్కడైనా ఉందా? అని హైకోర్టు ఏజీని ప్రశ్నించింది. సర్వే నెంబర్ 25లో ఉన్న ఈ భూములను పలు అవసరాలకు కేటాయిస్తూ వచ్చారని న్యాయస్థానానికి తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం రేపటి వరకు ఆ భూముల్లో పనులు ఆపాలని ఆదేశిస్తూ.. పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది.**

చదును చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అటవీ ప్రాంతాన్ని కొట్టివేయాలంటే నిపుణుల కమిటీ వేయాలి.

వన్య ప్రాణులు ఉన్న చోట భూములు చదును చేయాలంటే నిపుణుల కమిటీ పర్యటించాలి. నెల రోజుల పాటు అధ్యయనం చేయాలి. అక్కడ మూడు లేక్‌లు ఉన్నాయి. రాక్స్ ఉన్నాయి. ఎన్నో రకాల అరుదైన జంతువులున్నాయి. వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉంది. అయితే, ఇక్కడ సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. కొన్ని రోజులుగా ఈ భూముల దగ్గర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి" అని కోర్టుకు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. "2004లో ఈ భూమిని ఐఎంజీ అకాడమీకి అప్పగించారు. ఒప్పందం ప్రకారం ఐఎంజీ ఈ భూములను వినియోగించలేదు. దీంతో అప్పటి ప్రభుత్వం కేటాయింపును రద్దు చేసింది. ఆ భూముల్లో అటవీ భూమి అని ఎక్కడా లేదు. దీనికి ఆనుకొని ఉన్న హెచ్‌సీయూ భూముల్లో భారీ భవనాలు నిర్మించారు. నాలుగు హెలీప్యాడ్‌లున్నాయి. హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో పాములు, నెమళ్లు, చెట్లు ఉన్నాయి. పిటిషనర్ల వాదనల ప్రకారం ఆయా ప్రాంతాలను కూడా అటవీ భూములుగా ప్రకటించాల్సి ఉంటుంది. ఈ లెక్కన హైదరాబాద్ మహానగరంలో ఎక్కడా నిర్మాణాలు చేపట్టకూడదు" అని ఏజీ వాదనలు వినిపించారు.



## లాభాలతో ముగిసిన మార్కెట్లు..
# సెన్సెక్స్‌లో 21 షేర్లు గ్రీన్

**కా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటన నేపథ్యంలో భారత బెంచ్ మార్క్ ఈక్విటీ సూచీలు బుధవారం సానుకూలంగా ముగిశాయి. 30 షేర్ల సెన్సెక్స్ 592.93 పాయింట్లు లేదా 0.78 శాతం పెరిగి 76,617.44 వద్ద స్థిరపడింది. సూచీ 76,680.35 - 76,064.94 రేంజ్‌లో ట్రేడ్ అయింది.**

జొమాటో, టైటాన్, ఇండస్ఇండ్ బ్యాంక్, మారుతీ సుజుకీ ఇండియా, టెక్ మహీంద్రా షేర్లు 4.75 శాతం వరకు లాభపడటంతో సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 21 షేర్లు లాభాల్లో ముగిశాయి. అల్ట్రాటెక్ సిమెంట్, నెస్లే ఇండియా, బజాజ్ ఫైనాన్స్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు 1.36 శాతం వరకు నష్టపోయాయి.

సెన్సెక్స్‌కు అద్దంపడుతూ ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా 166.65 పాయింట్లు లేదా 0.72 శాతం పెరిగి 23,332.35 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సూచీ 23,350 వద్ద గరిష్టాన్ని, 23,158.45 పాయింట్ల వద్ద కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 1.61 శాతం లాభపడటంతో మిడ్ క్యాప్ స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ 1.12 శాతం లాభంతో ముగిసింది.

ఎన్ఎస్ఈలోని అన్ని సెక్టోరల్ ఇండెక్స్‌లు లాభాల్లో ముగియగా, నిఫ్టీ రియాల్టీ ఇండెక్స్ అత్యధికంగా 3.61 శాతం లాభపడింది. ఆ తర్వాత కన్జ్యూమర్ డ్యూరబుల్స్, బ్యాంకులు, ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు 2.51 శాతం వరకు లాభపడ్డాయి.

## ఆర్‌బీఐకి కొత్త డిప్యూటీ గవర్నర్..
# ఎవరీ పూనమ్ గుప్తా?

**ఢిల్లీ :** కేంద్రం మరో మహిళా అధికారిణికి కీలక బాధ్యతలు అప్పగించింది. ఇటీవల 2014 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ ఫారెన్ సర్వీస్ అధికారిణి నిధి తివారీని ప్రధాని మోదీ ప్రైవేట్ సెక్రటరీగా నియమించింది. తాజాగా, పూనమ్ గుప్తా అనే అధికారిణిని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఏప్రిల్ 7 నుంచి 9 మధ్య మానిటరీ పాలసీ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ముందు ప్రస్తుతం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకానమిక్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ పూనమ్ గుప్తాను ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆమె ఈ ఏడాది జనవరిలో రిటైరైన ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైకల్ పత్రా స్థానాన్ని భర్తీ చేయనున్నారు. ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా పూనమ్ గుప్తా మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.

**పూనమ్ గుప్తా ఎవరు?**
కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ పూనమ్ గుప్తా నియామకాన్ని ఆమోదించింది. ఆమె ప్రస్తుతానికి ప్రధానమంత్రికి ఆర్థిక సలహా కౌన్సిల్ సభ్యురాలు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకానమిక్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించే ముందు ఆమె ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో గ్లోబల్ మాక్రో, మార్కెట్ రీసర్చ్ లీడ్ ఎకానమిస్ట్‌గా పనిచేశారు. భారత అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల పరిశోధనా మండలిలో ప్రొఫెసర్‌గా, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకానమిక్స్ బోధించడంతో పాటు, ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్‌లో పరిశోధకురాలిగా పనిచేశారు. ఆమె 16వ ఫైనాన్స్ కమిషన్ సలహా మండలిలో సభ్యురాలిగా ఉన్నారు.






**ఇక ఆమె చదువు విషయానికి వస్తే**

- **ఎకానమిక్స్‌లో పీహెచ్‌డీ :** యూనివర్శిటీ ఆఫ్ మారీల్యాండ్, కాలేజ్ పార్క్ (1998)
- స్పెషలైజేషన్: మాక్రో ఎకానమిక్స్, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ ,ఇంటర్నేషనల్ ట్రేడ్
- **ఎం.ఎ ఎకానమిక్స్ :** యూనివర్శిటీ ఆఫ్ మారీల్యాండ్, కాలేజ్ పార్క్ (1995)
- **ఎం.ఎ ఎకానమిక్స్ :** ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకానమిక్స్ (1991)
- **బీఏ ఎకానమిక్స్ :** హిందూ కాలేజ్, ఢిల్లీ యూనివర్శిటీ (1989)
- ఆమె 1998లో అంతర్జాతీయ ఆర్థిక శాస్త్రంపై చేసిన పీహెచ్‌డీకి EXIM బ్యాంక్ అవార్డును గెలిచారు




## ఎక్స్‌పీరియన్ హైదరాబాద్ జీఐసీ..
# ఇప్పుడు డబుల్!

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డేటా, టెక్నాలజీ దిగ్గజం ఎక్స్‌పీరియన్, హైదరాబాద్‌లోని తమ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్‌ని (జీఐసీ) మరింతగా విస్తరించింది. గతానికన్నా రెట్టింపు ఆఫీస్ స్పేస్‌తో 85,000 చ.అ. విస్తీర్ణంలో ఈ కేంద్రం ఏర్పాటైనట్లు సంస్థ సీఈవో (టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్, ఇన్నోవేషన్) అలెగ్జాండర్ లింట్నర్ తెలిపారు.**

ప్రపంచ స్థాయి ప్రోడక్టులు రూపొందించేందుకు, నిరంతరాయంగా సర్వీసులు అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సెంటర్ ప్రధానంగా ఫిన్‌టెక్, అనలిటిక్స్, మోసాల నివారణ వంటి అంశాలకు సంబంధించిన కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెడుతుంది.

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ జీఐసీ ఎక్స్‌పీరియన్ ప్రపంచవ్యాప్త సాంకేతిక కార్యకలాపాలకు కీలకమైన నాడీ కేంద్రంగా రూపుదిద్దుకుంది. క్లౌడ్ మైగ్రేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పురోగతి, ప్రొడక్ట్ ఇన్నోవేషన్, ప్రాసెస్ ఆటోమేషన్లో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తోంది. భారత్‌లోని బలమైన ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రతిభను ఉపయోగించుకోవడం ద్వారా, ఎక్స్‌పీరియన్ ప్రపంచవ్యాప్తంగా స్కేలబుల్, డేటా ఆధారిత పరిష్కారాలను అందించే సామర్థ్యాన్ని పెంచుతోంది.

## ఆదిత్య బిర్లా ఫైనాన్స్ విలీనం పూర్తి..
# కంపెనీ ఇకపై..

**పూర్తి అనుబంధ సంస్థ ఆదిత్య బిర్లా ఫైనాన్స్‌ను విలీనం చేసుకునే ప్రక్రియ పూర్తయినట్లు ఆదిత్య బిర్లా క్యాపిటల్ (ఏబీసీఎల్) వెల్లడించింది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆదేశాల మేరకు ఇది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చినట్లవుతుందని పేర్కొంది.**



ADITYA BIRLA FINANCE

ఆదిత్య బిర్లా ఫైనాన్స్‌ను మాతృ సంస్థలో విలీనం చేయాలని గతేడాది మార్చిలో నిర్ణయం తీసుకున్నారు. విలీన సంస్థకు ఎండీ, సీఈవోగా విశాఖ మూల్యే, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా రాకేశ్ సింగ్ వ్యవహరిస్తారు. దీంతోపాటు నగేష్ పింగే, సునీల్ శ్రీవాస్తవ్ లను కంపెనీ ఇండిపెండెంట్ డైరెక్టర్లుగా నియమించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

**2024 డిసెంబర్ 31 నాటికి రూ .5.03 లక్షల కోట్లకుపైగా ఆస్తులు ఏబీసీఎల్ నిర్వహణలో ఉన్నాయి. వీటిలో రూ .1.46 లక్షల కోట్లకు పైగా ఏకీకృత రుణాలు ఉన్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో 9 నెలల కాలంలో కంపెనీ జీవిత, ఆరోగ్య బీమా వ్యాపారాలలో రూ .16,942 కోట్ల స్థూల ప్రీమియంను ఆర్జించింది. అదే సమయంలో రూ.28,376 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయాన్ని, రూ.2,468 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ఆర్జించింది. 2024 డిసెంబర్ 31 నాటికి కంపెనీ అన్ని వ్యాపారాలలో 1,482 శాఖలు, 2 లక్షలకు పైగా ఏజెంట్లు / ఛానల్ భాగస్వాములతో పాటు అనేక బ్యాంక్ భాగస్వాములతో దేశవ్యాప్త ఉనికిని కలిగి ఉంది.**



## నేరుగా వాట్సాప్‌లో..
# ఇన్వెస్టర్లకు సరికొత్త ఫీచర్

**హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్ హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ వాట్సాప్ ఆధారిత ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ 'ట్యాప్2ఇన్వెస్ట్'ను ప్రవేశపెట్టింది. ఈ ఇండస్ట్రీ-ఫస్ట్ ఫీచర్ ప్రస్తుత కేవైసీ-వెరిఫైడ్ ఇన్వెస్టర్లను వాట్సాప్‌లో క్లిక్ ఆధారిత ఇంటర్‌ఫేస్ ద్వారా మ్యూచువల్ ఫండ్ పథకాలలో పెట్టుబడి పెట్టడానికి అనుమతిస్తుందని మ్యూచువల్ ఫండ్ హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది.**

టెక్స్ట్ కమాండ్లపై ఆధారపడే సాంప్రదాయ వాట్సాప్ ఆధారిత పెట్టుబడి సేవల మాదిరిగా కాకుండా, ట్యాప్ 2ఇన్వెస్ట్ వాట్సాప్‌లో యూజర్ ఫ్రెండ్లీ, యాప్ లాంటి అనుభవాన్ని అందిస్తుంది. పెట్టుబడిదారులు నేరుగా వాట్సాప్ (+9182706 82706) ద్వారా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ (సిప్) ప్రారంభించవచ్చు. లేదా పెద్ద మొత్తం పెట్టుబడులను సైతం పెట్టవచ్చు.

యూపీఐ ఆటోపే, నెట్ బ్యాంకింగ్, ఇతర డిజిటల్ పేమెంట్ ఆప్షన్లకు ఈ ప్లాట్ఫామ్ సపోర్ట్ చేస్తుందని ఫండ్ హౌస్ తెలిపింది. వాట్సాప్ వంటి సుపరిచిత ప్లాట్‌ఫామ్‌లో ఇన్వెస్టర్లు తమ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను నిర్వహించడానికి 'ట్యాప్2ఇన్వెస్ట్' సురక్షితమైన మార్గాన్ని అందిస్తుందని హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ ఎండీ, సీఈఓ నవనీత్ మునోత్ వివరించారు.

## దేశంలో లక్షకుపైగా ఎలక్ట్రిక్ ఆటోలు
# అమ్మిన కంపెనీ

**మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ లిమిటెడ్ (ఎంఎల్ఎంఎంఎల్) ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాల (ఈవీ) తయారీదారుగా తన ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకుంది. ఎల్ 5 కేటగిరీలో కంపెనీ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు రెండు లక్షల కమర్షియల్ ఎలక్ట్రిక్ వాహనాలను విక్రయించినట్లు చెప్పింది.**

ఈ విభాగంలో ఎలక్ట్రిక్ వాహనాల వ్యాప్తిని 2024 ఆర్థిక సంవత్సరంలో 16.9 శాతం నుంచి 24.2 శాతానికి పెంచినట్లు పేర్కొంది. సుస్థిర మొబిలిటీ, సృజనాత్మక ఉత్పత్తుల తయారీకి కంపెనీ కట్టుబడి ఉందని చెప్పింది. దేశవ్యాప్తంగా లక్షకుపైగా ట్రియో మోడల్ ఎలక్ట్రిక్ ఆటోలను విక్రయించి ఈ విభాగంలో మొదటిస్థానంలో నిలిచామని స్పష్టం చేసింది.



**త్రీవీలర్ కమర్షియల్ వాహనాలకు సంబంధించి ఎల్ 5 కేటగిరీలో ఎంఎల్ఎంఎంఎల్ ముందంజలో ఉందని కంపెనీ పేర్కొంది. మహీంద్రా ట్రియో, జోర్ గ్రాండ్ వంటి ఉత్పత్తులు ఈ వృద్ధికి కీలకంగా నిలిచాయని తెలిపింది. ట్రియో 1,00,000 యూనిట్లకు పైగా విక్రయించడంతో ఈ వాహనాలకు వినియోగదారుల్లో విశ్వసనీయత నెలకొందని చెప్పింది. ఎల్5 ఎలక్ట్రిక్ వెహికల్ కేటగిరీలో 37.3 శాతం మార్కెట్ వాటాతో ఎంఎల్ఎంఎంఎల్ ఆధిపత్యం వహిస్తున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. దీన్ని కొనసాగించడానికి, వివిధ వ్యాపార అవసరాలను తీర్చడానికి రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలైన మెటల్ బాడీ ట్రియో, మహీంద్రా జీఈఓ మోడళ్ల విక్రయాలు ఎంతో తోడ్పడుతున్నాయని పేర్కొన్నాయి.**

# కాంతార ప్రీక్వెల్ రిలీజ్ వాయిదా.. స్పందించిన టీమ్




**కాంతార మూవీతో పాన్ ఇండియా క్రేజ్ తెచ్చుకున్న హీరో రిషబ్ శెట్టి. 2022లో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ప్రస్తుతం ఈ మూవీకి ప్రీక్వెల్‌గా కాంతార చాప్టర్-1ను ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు. ఈ సినిమాతో రిషబ్ శెట్టి బిజీగా ఉన్నారు. ఈ ఏడాదిలోనే కాంతార చాప్టర్ 1ను ప్రేక్షకుల ముందుకు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని డేట్ కూడా రివీల్ చేశారు.**

అయితే గత కొద్ది రోజులుగా ఈ సినిమా రిలీజ్ డేట్‌పై రూమర్స్ వినిపిస్తున్నాయి. కాంతార చాప్టర్ 1 సినిమా విడుదల మరింత ఆలస్యం కానుందని శాండల్‌వుడ్‌లో టాక్ నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఓ అభిమాని సోషల్ మీడియా వేదికగా ఈ మూవీ వాయిదా పడుతుందా? అని ప్రశ్నించాడు. దీనికి కాంతార టీమ్ స్పందించింది.

ఎట్టి పరిస్థితుల్లో కాంతార చాప్టర్ 1 మూవీని వాయిదా వేసేది లేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని సూచించింది. ముందు అనుకున్నట్లుగానే అక్టోబర్ 02వ తేదీ 2025న థియేటర్లలో విడుదల అవుతుందని సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఓ వీడియోను షేర్ చేసింది.

కాగా.. ఇటీవల 500 మంది యోధులతో ఓ యుద్ధ సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఈ ఫైట్ సీక్వెన్స్‌లో దాదాపు 3 వేల మంది భాగమయ్యారు. దీని కోసం రిషబ్ శెట్టి మూడు నెలల పాటు గుర్రపు స్వారీ, కలరి, కత్తియుద్ధం నేర్చుకున్నారు. దాదాపు 50 రోజుల పాటు చిత్రీకరించిన ఈ భారీ సన్నివేశాన్ని కర్ణాటకలోని పర్వతా ప్రాంతాల్లో చిత్రీకరించారు. 2022 చిత్రానికి ప్రీక్వెల్‌గా వస్తోన్న ఈ సినిమా బనవాసికి చెందిన కదంబ రాజుల కాలంలో జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. హోంబలే ఫిల్మ్స్ బ్యానర్‌లో రూ. 125 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

# రాత్రికి రాత్రే బుల్డోజర్లు.. అసలేం జరుగుతుంది?



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లో 400 ఎకరాల భూ వివాదంపై స్టార్ హీరోయిన్ రష్మిక స్పందించారు. ఈ విషయంపై ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ పెట్టారు. "రాత్రికి రాత్రే బుల్డోజర్లు. విద్యార్థుల అరెస్టులు. హైదరాబాద్ సెంట్రల్ విశ్వవిద్యాలయంలో నిజంగా ఏమి జరుగుతోంది?" అంటూ ఆమె ప్రశ్నించారు.

ఈ వివాదం గత కొన్ని రోజులుగా తీవ్ర రూపం దాల్చింది. విశ్వవిద్యాలయం సమీపంలోని 400 ఎకరాల భూమిని ప్రభుత్వం ఐటీ పార్క్ నిర్మాణం కోసం వేలం వేయాలని ప్రతిపాదించడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు తాజాగా రాజకీయ పార్టీలు తోడవడంతో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి.

400 ఎకరాల స్థలంలో పచ్చని చెట్లను నరికివేయడంతో, ఆ అడవిపై ఆధారపడిన మూగజీవుల జీవనాధారం కోల్పోతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది పర్యావరణానికి హాని కలిగించడమే కాకుండా, జీవవైవిధ్యానికి కూడా తీవ్ర నష్టం కలిగిస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. ఈ నిరసనకు పలువురు సినీ సెలబ్రిటీలు కూడా మద్దతు ఇస్తున్నారు. స్టార్ హీరోయిన్ సమంత, నాగ్ అశ్విన్, నటి రేణూ దేశాయ్ వంటి వారు సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు.

# జూనియర్ ఎన్టీఆర్‌కు

## ఇష్టమైన వంటకాలు, రెస్టారెంట్లు ఇవే!



**నాకు ఇష్టమైన వంటకాలు, రెస్టారెంట్లు ఇవే అభి'రుచుల'ను వెల్లడించిన జూనియర్ ఎన్టీఆర్**

**అంతర్జాతీయ స్థాయి సక్సెస్‌లు అందుకుంటున్న టాలీవుడ్‌కు కేంద్ర బిందువు హైదరాబాద్. అలాంటి పరిశ్రమలో గ్లోబల్‌స్టార్స్‌గా పేరున్న అనేకమంది నటీనటులకు మన నగరం నిలయం. అయితే ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అన్నట్టు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉన్న టాలీవుడ్ స్టార్స్ కూడా నగరంలోని కొన్ని రుచులకు దాసులే. వారు తమ అభి'రుచుల్ని' సంతృప్తి పరుచుకోడానికి నగరంలోని కొన్ని రెస్టారెంట్స్‌కి తరచూ రౌండ్స్ వేస్తుంటారు. అభిమానులకు చిక్కకుండా రహస్యంగా తమ టేస్ట్ బడ్స్‌ను శాంతింపజేస్తుంటారు. అదే విధంగా మన టాలీవుడ్ టాప్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్‌కి సైతం నగరంలో తనకు నచ్చిన, ఇష్టమైన వంటకాలు వడ్డించే రెస్టారెంట్స్ ఉన్నాయి.**

గత నెల్లో దేవర చిత్రాన్ని అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రమోట్ చేయడానికి జూనియర్ ఎన్టీఆర్ జపాన్ వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ చిత్రం అక్కడి థియేటర్లలో సందడి చేస్తోంది. మరోవైపు తారక్ తిరిగి నగరానికి వచ్చేశారు. అయితే తారక్ జపాన్ టూరుకు సంబంధించిన వీడియో ఫుటేజ్ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంది. ఆ ఇంటర్వ్యూలో నగరంలో తాను ఇష్టపడే రెస్టారెంట్స్ రుచుల వివరాలు ఆయన వెల్లడించడమే ఇందుకు కారణం.

ఫ్రెండ్.. జపనీస్ ట్రెండ్..

నగరంలోని నాగ చైతన్య అక్కినేనికి చెందిన షోయు రెస్టారెంట్ ఎన్టీఆర్ ఎంచుకున్న మొదటి ఎంపిక. 'ఈ అద్భుతమైన కళాత్మక ప్లేస్ నా స్నేహితుడు నాగ చైతన్య సొంతం. ఈ ప్రదేశంలో కొన్ని అద్భుతమైన జపనీస్ వంటకాలు అందుబాటులో ఉన్నాయి. మరీ ముఖ్యంగా జపనీస్ వంటకమైన సుషీ అక్కడ సూపర్బ్. హైదరాబాద్‌లో జపనీస్ వంటకాలకు నేను జై కొట్టే ప్లేస్ అది. ఇది నిజంగా అంతర్జాతీయ వంటకాలకు కేరాఫ్' అంటూ ఎన్టీఆర్ కొనియాడారు.

మరికొన్ని ప్రదేశాలు..

జపనీస్ వంటకాలకు సంబంధించి తన ఫేవరెట్‌ను తెలియజేయడంతో పాటు అచ్చమైన హైదరాబాదీ వంటకాలకు సంబంధించి కూడా ఎన్టీఆర్ కొన్నింటిని పేర్కొన్నారు. తాను ఆస్వాదించే మరికొన్ని రుచుల కోసం.. పాతబస్తీలోని షాదాబ్, జూబ్లీహిల్స్‌లోని స్పైస్ వెన్యూ, తెలంగాణ స్పైస్ కిచెన్, పాలమూరు గ్రిల్, అమీర్‌పేట్‌లోని కాకతీయ డీలక్స్ మెస్ కూడా ఆయన ఎంచుకున్న నచ్చే రుచుల జాబితాలో ఉన్నాయి.

# హీరోయిన్ శ్రీలీలకు ముఖ్యమంత్రి బహుమతి .. ఎందుకంటే?



**పెళ్లి సందడి తర్వాత టాలీవుడ్‌లో క్రేజీ హీరోయిన్‌గా మారిపోయింది శ్రీలీల. ఇటీవలే నితిన్ సరసన రాబిన్‌హుడ్ మూవీతో ప్రేక్షకులను పలకరించింది. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ సినిమా ఉగాది కానుకగా రిలీజై థియేటర్లలో సందడి చేస్తోంది. తెలుగులో స్టార్‌డమ్ సొంతం చేసుకున్న ఈ ముద్దుగుమ్మకు బాలీవుడ్‌లోనూ అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం బాలీవుడ్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన నటిస్తోంది ఈ బ్యూటీ. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.**

అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమా షూటింగ్ సిక్కింలో జరుగుతోంది. ఈ సందర్భంగా మూవీ టీమ్ అంతా కలిసి ఆ రాష్ట్ర సీఎంను కలిశారు. సినిమా షూటింగ్ కోసం సిక్కింను ఎంచుకున్నందుకు ముఖ్యమంత్రి వారిని అభినందించారు. ఈ నేపథ్యంలో కార్తీక్ ఆర్యన్, శ్రీలీల, అనురాగ్ బసుకు తమ రాష్ట్ర సంప్రదాయం ప్రతిబింబించేలా బహుమతులు అందజేశారు. అంతేకాకుండా మూవీ షూటింగ్ సజావుగా సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని సీఎంఓ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది.

ఈ సందర్భంగా డైరెక్టర్ అనురాగ్ బసు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో తమ మూవీని అద్భుతంగా తెరకెక్కిస్తామని వెల్లడించారు. ఇక్కడ షూటింగ్ సమయంలో ప్రజల నుంచి వస్తున్న మద్దతు, ప్రేమ పట్ల చాలా సంతోషంగా ఉందని కార్తీక్ ఆర్యన్ అన్నారు. మాకు భద్రత కల్పించినందుకు సిక్కిం పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇది మా షూటింగ్ సజావుగా పూర్తి చేసేందుకు సహకరిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. సిక్కింలోని ప్రకృతి దృశ్యాలు, ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు తనను ఆకర్షించాయని హీరోయిన్ శ్రీలీల అన్నారు. ఈశాన్య రాష్ట్రానికి తన మొదటి పర్యటనను నా జీవితంలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందని ఆనందం వ్యక్తం చేశారు.

# ఆమెనే ఓ అద్భుతం.. మరో ఆలియా ఎందుకు?: షాలిని పాండే

బాలీవుడ్ భామ షాలిని పాండే తెలుగువారికి సుపరిచితమైన పేరు. విజయ్ దేవరకొండ సరసన అర్జున్ రెడ్డి మూవీతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయమైంది. ఆ తర్వాత మహానటి, ఎన్టీఆర్ కథానాయకుడు, 118, ఇద్దరి లోకం ఒక్కటే సినిమాలతో మెప్పించింది. అయితే గతేడాది మహారాజ్ చిత్రంతో నటించిన ముద్దుగుమ్మ.. ఇటీవల జ్యోతిక ప్రధాన పాత్రలో వచ్చిన డబ్బా కార్టెల్ వెబ్ సిరీస్‌లో కనిపించింది.

షాలిని మాట్లాడుతూ.. "మనకు మరొక అలియా అవసరం లేదు. ఎవరూ మరో ఆలియా భట్ కాకూడదు. ఎందుకంటే ఆమె చాలా అద్భుతంగా ఉంది. కేవలం ఆమె సినిమాల వల్ల మాత్రమే కాదు. తెరపై మాత్రమే కాదు.. నేను వ్యక్తిగతంగా అలియా భట్‌ను అభిమానిస్తాను. అందు వల్లే నేను మరో ఆలియా భట్ కావాలనుకోవడం లేదు. నాకంటూ స్వంత వ్యక్తిత్వం కూడా ఉండాలి.



ఎవరైనా నన్ను షాలిని లాగే చూడాలని కోరుకుంటున్నా. అది నాకు చాలు.' అని అన్నారు. కాగా.. రణ్‌వీర్ సింగ్ సరసన జయేష్‌భాయ్ జోర్దార్‌లో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన షాలిని.. తెలుగులో అర్జున్ రెడ్డి మూవీతో ఫేమస్ అయింది.




## మాకు సొంత మైదానం.. కానీ ఇక్కడ పంజాబ్ క్యూరేటర్ ఉన్నారు: జహీర్ ఖాన్

**సొంత మైదానంలో లక్నో సూపర్ జెయింట్స్ ఓడిపోవడాన్ని ఆ జట్టు మెంటార్ జహీర్ ఖాన్ జీర్ణించుకోలేకపోతున్నాడు. పంజాబ్ కింగ్స్ గెలుపునకు పరోక్షంగా పిచ్ క్యూరేటరే కారణమంటూ విస్మయకర వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్-2025 లో భాగంగా లక్నో మంగళవారం పంజాబ్‌తో తలపడ్డ విషయం తెలిసిందే.**

లక్నోలోని భారత రత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఏకనా క్రికెట్ స్టేడియం ఇందుకు వేదిక. టాస్ గెలిచిన పంజాబ్.. లక్నో జట్టును తొలుత బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. అయితే, ఏకనా వికెట్‌పై పరుగులు రాబట్టేందుకు లక్నో బ్యాటర్లు తడబడ్డారు.

అయితే, 35 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి లక్నో కష్టాల్లో పడిన వేళ నికోలస్ పూరన్ (44), ఆయుశ్ బదోని (41), అబ్దుల్ సమద్ (12 బంతుల్లో 27)బ్యాట్ ఝులిపించారు. ఈ ముగ్గురి ధనాధన్ ఇన్నింగ్స్ కారణంగా లక్నో నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 171 పరుగులు చేయగలిగింది.

**16.2 ఓవర్లలోనే..**

ఇక లక్ష్య ఛేదనలో ఆరంభంలోనే ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (8) వికెట్ కోల్పోయినప్పటికీ పంజాబ్ అద్భుత రీతిలో పుంజుకుంది. వికెట్ కీపర్ ప్రభ్‌సిమ్రన్ సింఘ్ (34 బంతుల్లో 69) మెరుపు అర్ధ శతకంతో రాణించగా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (30 బంతుల్లో 52), నేహాల్ వధేరా (25 బంతుల్లో 43) అజేయంగా నిలిచి జట్టు గెలుపును ఖరారు చేశారు. ఈ ముగ్గురి విజృంభణ కారణంగా 16.2 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే నష్టపోయి పంజాబ్ లక్నోపై ఘన విజయం సాధించింది.

**మాకు సొంత మైదానం..**

ఈ నేపథ్యంలో మ్యాచ్ అనంతరం లక్నో మెంటార్, టీమిండియా మాజీ పేసర్ జహీర్ ఖాన్ షాకింగ్ కామెంట్స్ చేశాడు. లక్నో తమకు సొంత మైదానం అయినా.. పిచ్ క్యూరేటర్ మాత్రం పంజాబ్‌కు మేలు చేయడం నిరాశపరిచిందన్నాడు. ఈ మేరకు ఈఎస్‌పీఎన్‌క్రిక్‌ఇన్ఫోతో మాట్లాడుతూ... ''సొంత మైదానంలో మ్యాచ్ అంటే.. అక్కడి జట్టుకే కాస్త ఫేవర్‌గా ఉంటుంది.

**కానీ ఇక్కడ పంజాబ్ క్యూరేటర్ ఉన్నారు**

కానీ ఈ విషయంలో లక్నో క్యూరేటర్ చేసిన పని వల్ల.. ఇది హోం మ్యాచ్ అన్న భావనే రాలేదు. ఇక్కడి వికెట్ ఇలాగే ఉంటుందేమో బహుశా!.. ఇక్కడ పంజాబ్ క్యూరేటర్ ఉన్నారనిపించింది. ఈ మ్యాచ్‌లో నాకు అన్నింటికంటే ఇదే ఎక్కువ నిరాశను కలిగించింది.
క్యూరేటర్ మమ్మల్నే కాదు లక్నో అభిమానులను కూడా నిరాశకు గురిచేశారు. సొంతగడ్డపై లక్నో గెలుస్తుందని వారంతా భావించారు. కానీ ఇలా జరిగిపోయింది. జట్టుగా మేము పటిష్టంగా ఉన్నాము. మ్యాచ్‌లో ఓడిపోయామన్న వాస్తవాన్ని మేము అంగీకరిస్తున్నాం.

**వినూత్న రీతిలో.. ముందడుగు**

అయితే, సొంతమైదానంలో ఓటమి కాస్త ఎక్కువ బాధించింది. ఇక్కడ మాకు ఇంకో ఆరు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. మేము కచ్చితంగా మెరుగ్గా రాణిస్తామనే నమ్మకం ఉంది. సంప్రదాయ పద్ధతులను కాస్త పక్కనపెట్టి.. వినూత్న రీతిలో.. ముందడుగు వేసేందుకు మేము సిద్ధంగా ఉన్నాము'' అని జహీర్ ఖాన్ చెప్పుకొచ్చాడు.

**రహానే కూడా ఇలాగే**

కాగా లక్నో పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుందని చెప్తారు. కానీ పంజాబ్‌తో మ్యాచ్‌లో లక్నో స్పిన్నర్లకు పెద్దగా కలిసిరాలేదు. రవి బిష్ణోయి, మణిమరన్ సిద్ధార్థ్ ఒక్క వికెట్ కూడా తీయలేకపోగా.. దిగ్వేశ్ సింగ్ రాఠీ మాత్రం రెండు వికెట్లు పడగొట్టాడు.

మరోవైపు.. పంజాబ్ బౌలర్లలో స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్, రిస్ట్ స్పిన్నర్ యజువేంద్ర చహల్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. ఇదిలా ఉంటే.. ఆరంభమ్యాచ్‌లో ఓటమి తర్వాత కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజింక్య రహానే కూడా.. ఈడెన్ గార్డెన్స్ పిచ్ గురించి ఇదే తరహా వ్యా ఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

## కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో స్నేహిత్

**హైదరాబాద్: అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ ప్లేయర్ సూరావజ్జుల స్నేహిత్ అద్భుత పురోగతి సాధించాడు. గతవారం చెన్నైలో జరిగిన వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) స్టార్ కంటెండర్ లెవెల్ టోర్నీలో స్నేహిత్ క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు.**

ఈ ప్రదర్శనతో అతను తన కెరీర్‌లో తొలిసారి టాప్-100లోకి వచ్చాడు. మంగళవారం విడుదల చేసిన పురుషుల సింగిల్స్ తాజా ర్యాంకింగ్స్‌లో స్నేహిత్ ఏకంగా 34 స్థానాలు ఎగబాకి 89వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

**నా తదుపరి లక్ష్యం అదే**

చెన్నై స్టార్ కంటెండర్ టోర్నీ రెండో రౌండ్‌లో స్నేహిత్ ప్రపంచ 29వ ర్యాంకర్ యుకియా ఉడా (జపాన్)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత దిగ్గజం, ఐదుసార్లు ఒలింపియన్ ఆచంట శరత్ కమల్‌పై గెలిచి పెను సంచలనం సృష్టించాడు.
'నా తాజా ప్రపంచ ర్యాంక్‌తో ఎంతో సంతోషంగా ఉన్నా. ఈ ఏడాదిలోపు టాప్-100లోకి రావాలని లక్ష్యంగా పెట్టుకున్నా. దానిని మూడు నెలల్లోపే అందుకున్నా. ఇక టాప్-50లోకి రావడమే నా తదుపరి లక్ష్యం' అని అంతర్జాతీయస్థాయిలో భారత్ తరఫున దజనుకంటే ఎక్కువ పతకాలు సాధించిన స్నేహిత్ వ్యాఖ్యానించాడు.

**ప్రపంచ చెస్ ర్యాంకింగ్స్: నాలుగో స్థానంలో అర్జున్**

అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) తాజా ర్యాంకింగ్స్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్, భారత స్టార్ ఇరిగేశి అర్జున్ నాలుగో స్థానానికి చేరుకున్నాడు. గత నెలలో అర్జున్ ఐదో ర్యాంక్‌లో ఉన్నాడు. ప్రస్తుతం అర్జున్ ఖాతాలో 2782 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. మరోవైపు ప్రపంచ చాంపియన్, తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ 2787 రేటింగ్ పాయింట్లతో మూడో ర్యాంక్‌ను నిలబెట్టుకొని భారత నంబర్‌వన్ ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు.

**తొలి రౌండ్‌లోనే లక్ష్య చహర్ ఓటమి**

వరల్డ్ బాక్సింగ్ కప్ టోర్నమెంట్‌ను భారత్ పరాజయంతో ప్రారంభించింది. బ్రెజిల్‌లోని ఫాజ్ డు లుగాకు నగరంలో ఈ టోర్నీ జరుగుతోంది. పురుషుల 80 కేజీల విభాగంలో భారత బాక్సర్ లక్ష్య చహర్‌కు తొలి రౌండ్‌లోనే ఓటమి ఎదురైంది. బ్రెజిల్ బాక్సర్, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్ రజత పతక విజేత వాండర్లీ పెరీరాతో జరిగిన బౌట్‌లో లక్ష్య చహర్ 0-5తో ఓడిపోయాడు. 150 పాయింట్లకుగాను పెరీరాకు 149 పాయింట్లు... లక్ష్య చహర్‌కు 135 పాయింట్లు లభించాయి. వరల్డ్ బాక్సింగ్ ఆధ్వర్యంలో ఆరు రోజులపాటు జరుగుతున్న ఈ టోర్నీలో భారత్ నుంచి పది మంది బాక్సర్లు బరిలో ఉన్నారు.

**రిత్విక్ జోడీకి నిరాశ**

హైదరాబాద్: భారత డేవిస్ కప్ జట్టు సభ్యుడు, హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరికి వరుసగా మూడో టోర్నీలోనూ నిరాశ ఎదురైంది. ఫిబ్రవరిలో సాంటియాగో ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో డబుల్స్ టైటిల్ నెగ్గిన రిత్విక్ ఆ తర్వాత పోటీపడ్డ మూడు టోర్నీలలో తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు. అమెరికాలో జరుగుతున్న హ్యూస్టన్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో కొలంబియాకు చెందిన నికోలస్ బరియంతోస్‌తో జతకట్టి ఆడిన రిత్విక్ తొలి రౌండ్‌లో నిష్క్రమించాడు.

**పురుషుల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో రిత్విక్ చౌదరీ–బరియంతోస్ ద్వయం 5–7, 4–6తో మార్సెలో జోర్మన్–రాఫెల్ మటోస్ (బ్రెజిల్) జోడీ చేతిలో పరాజయం పాలైంది. 86 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్–బరియంతోస్ ఐదు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశారు. తొలి రౌండ్‌లో ఓడిన రిత్విక్–బరియంతోస్‌లకు 3,700 డాలర్ల (రూ. 3 లక్షల 15 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.**

## ఉతికి ఆరేసిన బట్లర్..

# ఆర్సీబీపై గుజరాత్ ఘన విజయం

**చిన్నస్వామి స్టేడియం (బెంగళూరు) వేదికగా ఆర్సీబీతో ఇవాళ (ఏప్రిల్ 2) జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి గుజరాత్ ఆహ్వానం మేరకు తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ.. లివింగ్‌స్టోన్ (40 బంతుల్లో 54; ఫోర్, 5 సిక్సర్లు), టిమ్ డేవిడ్ (18 బంతుల్లో 32; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) పోరాడటంతో నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది.**

మధ్యలో జితేశ్ శర్మ (21 బంతుల్లో 33; 5 ఫోర్లు, సిక్స్) కూడా ఓ మోస్తరుగా బ్యాట్ ఝులిపించాడు. ఆర్సీబీ ఇన్నింగ్స్‌లో వీరు మినహా ఎవరూ రాణించలేదు. సాల్ట్ 14, విరాట్ కోహ్లి 7, పడిక్కల్ 4, పాటిదార్ 12, కృనాల్ పాండ్యా 5 పరుగులు చేసి ఔటయ్యారు. గుజరాత్ బౌలర్లలో సిరాజ్ 3 వికెట్లు తీయగా.. సాయికిషోర్ 2, అర్షద్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణ, ఇషాంత్ శర్మ తలో వికెట్ పడగొట్టారు.




**170 పరుగుల నామ మాత్రపు లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన గుజరాత్ 17.5 ఓవర్లలో కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయతీరాలకు చేరింది. జోస్ బట్లర్ (39 బంతుల్లో 73 నాటౌట్; 5 ఫోర్లు, 6 సిక్సర్లు), సాయి సుదర్శన్ (36 బంతుల్లో 49; 7 ఫోర్లు, సిక్స్), షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (18 బంతుల్లో 30 నాటౌట్; ఫోర్, 3 సిక్సర్లు) గుజరాత్‌ను గెలిపించారు.**

**తొలుత నిదానంగా ఆడిన బట్లర్.. ఆతర్వాత గేర్ మార్చి ఆర్సీబీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఆఖర్లో రూథర్‌ఫోర్డ్ (ఇంపాక్ట్ ప్లేయర్) తనదైన శైలితో చెలరేగిపోయాడు. ఆర్సీబీ బౌలర్లలో హాజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్ తలో వికెట్ తీశారు. ఈ గెలుపుతో గుజరాత్ పాయింట్ల పట్టికలో నాలుగో స్థానానికి ఎగబాకింది. టాప్ ప్లేస్‌లో ఉండిన ఆర్సీబీ మూడో స్థానానికి పడిపోయింది.**

# ముంబై ఇండియన్స్‌కు కొనసాగనున్న కష్టాలు..!

**ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌ను ముంబై ఇండియన్స్ తమ ఏస్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా లేకుండానే మొదలుపెట్టింది. ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్ ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడగా.. ఇందులో బుమ్రా లేని లోటు కొట్టొచ్చినట్లు కనిపించింది. ఈ మూడు మ్యాచ్‌ల్లో ముంబై తొలి రెండు మ్యాచ్‌లు ఓడి.. ఆతర్వాతి మ్యాచ్‌లో గెలిచింది.**

ముందుగా జరిగిన ప్రచారం ప్రకారం బుమ్రా తొలి మూడు మ్యాచ్‌ల తర్వాత అందుబాటులోకి రావాల్సి ఉండింది. అయితే బుమ్రా రాక మరింత ఆలస్యమవుతుందని తాజా నివేదికలు చెబుతున్నాయి. బుమ్రా గాయం ఊహించిన దానికంటే తీవ్రమైందని బీసీసీఐ వర్గాల సమాచారం. బుమ్రా బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రాక్టీస్ మొదలుపెట్టినప్పటికీ.. అక్కడి వైద్యులు రిస్క్ తీసుకోదలచుకోలేదని తెలుస్తుంది.

బుమ్రాపై అతిగా ఒత్తిడి తెస్తే మొదటికే మోసం రావచ్చని వారు భావిస్తున్నారట. ప్రస్తుతం వైద్యులు బుమ్రాకు స్ట్రెస్ ఫ్రాక్చర్ కాకుండా జాగ్రత్తగా కాపాడుకుంటున్నారట. ఐపీఎల్ ఎంట్రీకి బుమ్రా కూడా తొందరపడటం లేదని




తెలుస్తుంది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బుమ్రా చాలా జాగ్రత్తగా ఉన్నాడని సమాచారం. ఒకవేళ బుమ్రా తొందరపడి ఐపీఎల్‌లో ఆడాలనుకుంటే గాయం తీవ్రతరమై దీర్ఘకాలిక నష్టం సంభవించే ప్రమాదం ఉంది.

అందుకే బుమ్రా విషయంలో బీసీసీఐ రిస్క్ తీసుకోదలచుకోలేదని తెలుస్తుంది. దీన్ని బట్టి ఐపీఎల్ 2025లో బుమ్రా ఎంట్రీ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. బుమ్రా తిరిగి ఎప్పుడు బరిలోకి దిగుతాడన్న విషయాన్ని బీసీసీఐ అధికారులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. ప్రస్తుత పరిస్థితులను చూస్తే మాత్రం బుమ్రా మే నెలలోనే ఐపీఎల్ ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. అప్పటికి ముంబై ఇండియన్స్ 10 మ్యాచ్‌లకు పైగా ఆడేసి ఉంటుంది.

**బుమ్రా గైర్హాజరీ ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలను తప్పక ప్రభావితం చేస్తుంది. ఇప్పటికే ముంబై ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండింట ఓడింది. ఒకవేళ బుమ్రా మే నెలలో ఎంట్రీ ఇచ్చినా నాలుగు మ్యాచ్‌లు మాత్రమే ఆడే అవకాశం ఉంటుంది. ముంబై ఇండియన్స్ బుమ్రా లేకపోయినా తదుపరి మ్యాచ్‌ల్లో సత్తా చాటితే ప్లే ఆఫ్స్‌కు చేరే అవకాశం ఉంటుంది. అప్పుడు బుమ్రా సేవలను ఆ జట్టు ప్లే ఆఫ్స్‌లో వినియోగించుకోవచ్చు.**

**ప్రస్తుత పరిస్థితులను చూస్తే ముంబై ఇండియన్స్‌కు అంత సీన్ లేదనిపిస్తుంది. ఆ జట్టులో సమతుల్యత లోపించినట్లు కనిపిస్తుంది. బౌలింగ్‌లో బౌల్ట్ మినహా ఆ జట్టులో సీనియర్ ఎవరూ లేరు. కొత్తగా వచ్చిన బౌలర్లతో ఆ జట్టు కాలం వెల్లదీస్తుంది. కేకేఆర్‌తో జరిగిన మ్యాచ్‌లో యువ పేసర్ అశ్వనీ కుమార్ సత్తా చాటడంతో ముంబై ఇండియన్స్ సీజన్ తొలి విజయం నమోదు చేసింది.**

**బ్యాటింగ్‌లో కూడా ఆ జట్టు అంతంతమాత్రంగానే ఉంది. రోహిత్ శర్మ పూర్తిగా ఫామ్ కోల్పోయాడు. ఇలాంటి పరిస్థితుల్లో ముంబై ఇండియన్స్ ఏ మేరకు రాణిస్తుందో చూడాలి. కాగా, బుమ్రా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ సందర్భంగా గాయపడిన విషయం తెలిసిందే. అదే గాయం కారణంగా అతను ఛాంపియన్స్ ట్రోఫీ కూడా దూరమయ్యాడు.**

# రాజస్థాన్ రాయల్స్‌కు గుడ్ న్యూస్

**ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో తొలి రెండు మ్యాచ్‌ల్లో (సన్‌రైజర్స్, కేకేఆర్) ఓడి, ఆతర్వాతి మ్యాచ్‌లో గెలిచిన (సీఎస్‌కే) రాజస్థాన్ రాయల్స్ ఏప్రిల్ 5న ఛండీఘఢ్‌లో పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌కు ముందు ఆ జట్టుకు శుభవార్త అందింది. పూర్తి ఫిట్‌నెస్ లేని కారణంగా తొలి మూడు మ్యాచ్‌ల్లో వికెట్‌కీపింగ్‌కు, కెప్టెన్సీకి దూరంగా ఉన్న సంజూ శాంసన్ పంజాబ్ మ్యాచ్‌తో వికెట్‌కీపింగ్ మరియు కెప్టెన్సీ బాధ్యతలను తిరిగి చేపట్టనున్నాడు.**

ఈ మేరకు శాంసన్‌కు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి క్లియరెన్స్ వచ్చింది. చేతి వేలు ఫ్రాక్చర్ కారణంగా శాంసన్ తొలి మూడు మ్యాచ్‌ల్లో కేవలం బ్యాటింగ్‌కు మాత్రమే పరిమితమైన విషయం తెలిసిందే. బ్యాటింగ్‌కు మాత్రమే పరిమితం కావడంతో శాంసన్ కెప్టెన్సీని కూడా వదులుకుని ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగాడు. శాంసన్ గైర్హాజరీలో రియాన్ పరాగ్ రాయల్స్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు.

తొలి మూడు మ్యాచ్‌ల్లో కెప్టెన్సీ, వికెట్‌కీపింగ్ బాధ్యతలకు దూరంగా ఉన్న శాంసన్ బ్యాటింగ్‌లో పర్వాలేదనిపించాడు. ఎస్‌ఆర్‌హెచ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 37 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 66 పరుగులు చేశాడు. ఆతర్వాత కేకేఆర్‌పై 11 బంతుల్లో 2 ఫోర్ల సాయంతో 13 పరుగులు చేశాడు. చివరిగా సీఎస్‌కేతో ఆడిన మ్యాచ్‌లో 16 బంతుల్లో ఫోర్, సిక్సర్ సాయంతో 20 పరుగులు చేశాడు.

కాగా, కెప్టెన్‌గా రియాన్ పరాగ్ అనుభవరాహిత్యం రాయల్స్ ఆడిన తొలి మూడు మ్యాచ్‌ల్లో కొట్టొచ్చినట్లు కనిపించింది. కీలకమైన సమయాల్లో పరాగ్ మంచి నిర్ణయాలు తీసుకోలేకపోయాడు. సీఎస్‌కేతో మ్యాచ్‌లో రాయల్స్ గెలిచింది కానీ, ఆ మ్యాచ్‌లో ఓడుంటే మాత్రం పరాగ్‌పై అందరూ దుమ్మెత్తిపోశేవారు. ఆ మ్యాచ్‌లో పరాగ్ మంచి టచ్‌లో ఉన్న జోఫ్రా ఆర్చర్‌ను కాదని చివరి ఓవర్‌ను సందీప్ శర్మకు ఇచ్చాడు (బౌలింగ్).




**పంజాబ్-రాయల్స్ మ్యాచ్ విషయానికొస్తే.. ఈ మ్యాచ్ రాయల్స్‌కు అంత ఈజీగా ఉండదు. పంజాబ్ ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచ్‌ల్లో బంపర్ విక్టరీలు సాధించి మాంచి జోష్ మీద ఉంది. ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అరివీర భయంకరమైన ఫామ్‌లో ఉన్నాడు. తొలి మ్యాచ్‌లో శశాంక్ సింగ్.. తాజాగా లక్నోతో జరిగిన మ్యాచ్‌లో ప్రభ్‌సిమ్రన్ సింగ్, నేహల్ వధేరా మంచి టచ్‌లో కనిపించారు.**

**ఇంకా ఆ జట్టు విధ్వంసకర వీరులు మ్యాక్స్‌వెల్, స్టోయినిస్ టచ్‌లోకి రాలేదు. వారిద్దరూ ఫామ్‌లోకి వస్తే ఏ జట్టు పంజాబ్ ముందు నిలువలేదు. పంజాబ్ బౌలింగ్ విభాగంలోనూ పటిష్టంగా ఉంది. లక్నో మ్యాచ్‌లో అర్షదీప్, జన్సెన్, చహల్ రాణించారు. ఫెర్గూసన్ కూడా పర్వాలేదనిపించాడు. ఇంత పటిష్టమైన పంజాబ్‌ను రాయల్స్ ఏ మేరకు నిలువరిస్తుందో చూడాలి.**

**ఆ ఓవర్‌లో సీఎస్‌కే 20 పరుగులు చేయాల్సి ఉండగా.. సందీప్ శర్మ ఎలాగోలా మేనేజ్ చేసి 13 పరుగులు మాత్రమే ఇచ్చాడు. ఒకవేళ పరాగ్ నిర్ణయం (సందీప్‌కు బౌలింగ్ ఇవ్వడం) మిస్ ఫైర్ అయ్యుంటే రాయల్స్ వరుసగా మూడో పరాజయం ఖాతాలో వేసుకోవాల్సి వచ్చేది.**

**పరాగ్ ఎపిసోడ్‌ను అటుంచితే.. శాంసన్ రాకతో రాయల్స్ ఫేట్ మారుతుందేమో చూడాలి. ప్రస్తుతం రాయల్స్ పేలవమైన రన్‌రేట్ కలిగి చివరి నుంచి రెండో స్థానంలో ఉంది. సన్‌రైజర్స్ మ్యాచ్‌లో భారీ లక్ష్య ఛేదనలో ధీటుగా బదులిచ్చే ప్రయత్నం చేసినా.. కేకేఆర్ మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో తడబడింది. సీఎస్‌కేపై గెలిచినప్పటికీ రాయల్స్ రన్‌రేట్ మెరుగుపడలేదు. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో కేకేఆర్ ఒక్కటే రాయల్స్ కంటే కింద ఉంది (చివరి స్థానం).**